# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారత దేశ 78 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశ వ్యాప్తంగా ప్రజలు సమధికోత్సాహంతో నిర్వహిస్తున్నారు.**
2. **దేశ భక్తి స్ఫూర్తి చాటేందుకు కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన "ఇంటింటా జాతీయ జెండా" కార్యక్రమాన్ని ప్రజలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు.**
3. **భారత దేశాన్ని ప్రపంచ నైపుణ్యాల రాజధానిగా తీర్చి దిద్దుతామని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఉద్ఘాటించారు.**
4. **రాష్ట్ర ప్రజలకు గరిష్ట స్థాయిలో ప్రయోజనం చేకూర్చే విధానాలను ప్రభుత్వం అమలు చేస్తుందని ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
5. **రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో మంత్రులు, శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్లు జాతీయ పతాకాలను ఎగుర వేశారు.**

==========================

భారత దేశ 78 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశ ప్రజలు ఈ రోజు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. బ్రిటిష్ వలస పాలన నుండి భారత దేశం విముక్తి పొందిన 1947 ఆగస్టు 15 వ తేదీ భారతీయులకు చిరస్మరణీయమైన రోజు. ఎందరో మహనీయుల నిరుపమాన ధైర్య సాహసాలు ...., త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం లభించింది. ఇంతటి ఘనమైన చరిత్ర కలిగిన ఈ రోజును ప్రజలు సమధికోత్సాహంతో స్వాతంత్ర్య పర్వ దినాన్ని జరుపుకుంటున్నారు. దేశ వ్యాప్తంగా వాడ వాడలా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి దేశ భక్తిని చాటుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు ఆజాది కా అమృత్ మహోత్స వంలో భాగమైన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జాతీయ సమైక్యత ... సమగ్రత చాటి చెప్పేలా ఉత్సాహంతో నిర్వహిస్తున్నారు. మన జాతీయ పతాకాన్ని రూపొందించిన కృష్ణా జిల్లా భట్లపెనుమర్రుకు చెందిన పింగళి వెంకయ్య దేశానికి చేసిన సేవలను సేవలను కూడా ప్రజలు ఈ సందర్భంగా స్మరించుకుంటున్నారు.

--------------------------

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో జరిగిన కార్యక్రమాలలో పాల్గొన్న ప్రజలు దేశ సేవలో మమేక మవుతామంటూ ప్రతిన చేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. దేశ వ్యాప్తంగా అన్ని నగరాలు ....,

పట్టణాలు ..., గ్రామాలలోని ప్రజలు తమ తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దేశ భక్తి స్ఫూర్తిని చాటే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రజలు జాతీయ జెండాలను చేతబూని వీధులలో ప్రదర్శనలు నిర్వహించారు. సరిహద్దులలో కూడా సైనికులు దేశ భక్తి స్ఫూర్తితో జాతీయ పతాకాలను ధరించి మోటార్ సైకిళ్లపై ప్రదర్శనలు నిర్వహించారు. ప్రజల సౌలభ్యం కోసం జాతీయ పతాకాలను పోస్టాఫీసులలో విక్రయించారు.

...సాంగ్...

---------------------------

"వికసిత్ భారత్- 2047" అన్న ఇతివృత్తంతో జరుగుతున్న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని ఎర్రకోటపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సైనిక హెలికాప్టర్లు ఆ సమయంలో పూల వర్షం కురిపించాయి. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ...., ఉప రాష్ట్రపతి జగ్ దీప్ ధంకడ్ ...., కేంద్ర మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మాట్లాడుతూ ..... దేశం కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన మహనీయుల త్యాగాలను స్మరించుకుందామని పిలుపు నిచ్చారు. స్వాతంత్ర్య సమర యోధులకు దేశం రుణపడి ఉందని ...., ఆ త్యాగ పురుషుల కలలను మనం  సాకారం చేయాలని అన్నారు.

భారత దేశాన్ని ప్రపంచ నైపుణ్యాల రాజధానిగా తీర్చి దిద్దడానికి అవిశ్రాంత కృషి చేస్తామని ఉద్ఘాటించారు. ప్రపంచానికే అన్నం పెట్టే స్థాయికి భారత దేశం ఎదగాలని ఆకాంక్షించారు. "" వికసిత భారత–2047 నినాదం "" .... 140 కోట్ల మంది ప్రజల కృతనిశ్చయమని ఉద్ఘాటించారు. దేశాభివృద్ధికి అన్ని రంగాలలో సమూల సంస్కరణలు తీసుకురావలసిన అవసరం ఉందని నరేంద్ర మోడీ పేర్కొంటూ ..

.....వాయిస్....41  సెకన్లు....

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా 78 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజలు సమధికోత్సాహంతో నిర్వహిస్తున్నారు. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు జాతీయ జెండాను ఎగుర వేసి పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఉప ముఖ్య మంత్రి కె. పవన్ కళ్యాణ్ కాకినాడ ..., మానవ వనరులు శాఖ మంత్రి నారా లోకేష్ గుంటూరు పట్టణాలలో జరిగిన స్వాతంత్ర్య వేడుకలలో పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ..... రాష్ట్ర ప్రజలకు గరిష్ట స్థాయిలో ప్రయోజనం చేకూర్చే విధానాలను ప్రభుత్వం  రూపొందిస్తోందని తెలిపారు. ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి అన్న రెండు అంశాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని, అన్ని శాఖలలో సమీక్షలు చేపట్టి .... ఉత్తమ పని విధానాన్ని అమలు చేస్తామని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ

..వాయిస్.. 43 సెకన్లు....

---------------------------

రాష్ట్రంలో జిల్లాల వ్యాప్తంగా జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రులు ..., శాసన సభ్యులు ...., జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. తిరుపతిలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి..., కడపలో అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూఖ్ ...., అనకాపల్లిలో హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ...., రాజమహేంద్రవరంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొనగా .....,.ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ..., చిత్తూరులో వైద్య ..., ఆరోగ్య శాఖల మంత్రి సత్య కుమార్ యాదవ్ జాతీయ జెండాను ఎగుర వేశారు.

---------------------------

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం సరస్వతి నగర్ లోని అక్షర విద్యాలయంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యానాయుడు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

విజయవాడలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

రాష్ట్ర శాసన సభ వద్ద సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు జాతీయ జెండాను ఎగుర వేశారు.

శాసన మండలి వద్ద మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

---------------------------

ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆకాశవాణి విజయవాడ కేంద్రం డీడీజీ, కార్యాలయ అధిపతి సోమేశ్వర రావు జాతీయ జెండాను ఆవిష్కరించి, ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ.. అనేక దశాబ్దాలుగా ఆకాశవాణి ప్రజలలో దేశభక్తిని పెంపొందిస్తూ ఎన్నో కార్యక్రమాలను ప్రసారం చేస్తోందని అన్నారు.

అనంతరం ' హర్ ఘర్ తిరంగా ' నినాదాలతో ఉద్యోగులందరితో కలిసి ర్యాలీగా వెళ్లి ఆకాశవాణి సిబ్బంది వసతి గృహ సముదాయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం లో కార్యక్రమ విభాగాధిపతి బి. వెంకటేశ్వర్లు, న్యూస్ ఎడిటర్ అల్లు మురళి, పరిపాలనా అధికారి కామేశ్వర రావు, కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ మాణిక్యరావు, ఇంజనీరింగ్, అడ్మినిస్ట్రేషన్, కార్యక్రమ, వార్తా విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

అనంతపురంలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతపురం ఆకాశవాణి ప్రాంతీయ కార్యాలయంలో ప్రోగ్రామ్ హెడ్ నాగేశ్వర రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి సిబ్బంది పాల్గొన్నారు.

---------------------------

కృష్ణాజిల్లా గుడివాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించారు. పేదలకు తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తోందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలువురికి భోజనం వడ్డించారు.

=====================